# హోల్‌సేల్ పేరుతో మద్యం సిండికేట్

- కుమ్మక్కైన వైన్స్ షాపుల నిర్వాహకులు
- వైన్స్ షాపుల నుంచి బెల్టుషాపులకు తరలింపు
- రూ.20 నుంచి రూ.30 అదనం
- అటువైపు కన్నెత్తి చూడని ఎక్సైజ్ అధికారులు

నర్సింహులపేట, డిసెంబర్ 5: తొర్రూరు ఎక్సైజ్ సర్కిల్ పరిధి వైన్స్ షాపుల నిర్వాహకులు సిండికేట్ అయ్యారు. అధిక ధరలకు మద్యం విక్రయిస్తూ రోజూ లక్షల్లో దండుకుంటున్నారు. హోల్‌సేల్ అంటూ రూ.10 నుంచి రూ.15 ఎక్కువకు బెల్టు షాపులకు మాత్రమే సప్లై చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని మద్యంప్రియులు రూ.20 నుంచి రూ.30 ఎక్కువ చెల్లించి జేబులు ఖాళీ చేసుకుంటున్నారు. సంబంధిత అధికారులు వైన్స్ షాపుల వైపు కన్నెత్తి చూడడంలేదు. దీంతో బెల్టుషాపుల్లో ఎక్కువ ధరకు కొనుగోలు చేయాల్సి వస్తోందని మద్యంప్రియులు వాపోతున్నారు. ఎక్సైజ్ శాఖ అధికారుల సహకారంతోనే ఈ సిండికేట్ వ్యవహారం నడుస్తోందనే అనుమానాలు వస్తున్నాయి. తొర్రూరు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో 21 మద్యం దుకాణాలు ఉండగా, మండలాల వారీగా వైన్స్ షాపుల నిర్వాహకులు కుమ్మక్కయ్యారు. కొత్త వ్యాపారులందరూ దుకాణాల ప్రారంభానికి ముందే సమావేశమై సిండికేటు అయ్యారు. పాతవారితో కలిసి దర్జాగా అధిక ధరలకు బెల్టు షాపులకు విక్రయిస్తున్నారు.


నర్సింహులపేటలో వైన్స్‌షాపు వద్ద మద్యం ప్రియుల ఘర్షణ (ఫైల్)

### దందా.. కొనసాగుతోందిలా..

క్వార్టరు, బీరు బాటిల్‌పై రూ.10, లిక్కరు హాఫ్ బాటిల్‌పై రూ.15, ఫుల్ బాటిల్‌పై రూ.20 చొప్పున అధికంగా వసూలు చేస్తున్నారు. బెల్టు షాపులకు మద్యం విక్రయాలు చేస్తూ నిత్యం రూ.లక్షల్లో దోపిడీకి పాల్పడుతున్నారు. సంబంధిత అధికారులు ఇటువైపు రాకుండా సిండికేటు వ్యాపారులు చక్రం తిప్పుతున్నారనే విమర్శలు వినవస్తున్నాయి. ఇప్పటికైనా ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు దృష్టిసారించి ఈ దోపిడీని అరికట్టాలని మద్యంప్రియులు కోరుతున్నారు.

### అధిక ధరకు విక్రయిస్తే కఠిన చర్యలు

వైన్స్ షాపుల్లో మద్యం అధిక ధరలకు విక్రయిస్తే కఠినచర్యలు తీసుకుంటాం. ఎవరైనా ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు విక్రయిస్తే సమాచారం అందించాలి. వైన్స్ షాపుల్లో తనిఖీలు చేపడతాం. మద్యం దుకాణాల్లో హోల్ సేల్ అని లేకుండా చర్యలు తీసుకుంటాం.

– భాస్కర్‌రావు, తొర్రూరు ఎక్సైజ్ సీఐ

## 'కేసీఆర్‌తోనే మైనార్టీల అభివృద్ధి'


అజహర్

ఖానాపురం, డిసెంబర్ 5: ముస్లిం మైనార్టీల అభివృద్ధి కేసీఆర్‌తోనే సాధ్యమైందని ముస్లిం మైనార్టీల మండల అధ్యక్షుడు ఎండీ అజహర్ అన్నారు. మంగళవారం ఆయన మండలకేంద్రంలో మాట్లాడుతూ పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ముస్లింలకు పెద్దపీట వేసిందన్నారు. మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేసి, ఒక్కో విద్యార్థికి ఏడాదికి రూ. 1.25 లక్షలు ఖర్చు చేసి నాణ్యమైన విద్య అందిస్తున్నదని గుర్తుచేశారు. మైనార్టీ పాఠశాలల్లో చదువుకున్న ఎందరో విద్యార్థులు నేడు ప్రయోజకులయ్యారని తెలిపారు. మైనార్టీ కార్పొరేషన్‌తో పేద ముస్లిం యువతీ యువకులకు రూ. లక్ష ఆర్థిక సాయం అందించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కిందని గుర్తుచేశారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఓటమి చెందినప్పటికీ ముస్లింలు అధైర్య పడొద్దని, ఐదేళ్లు పార్టీ కోసం శ్రమించి, మళ్లీ అధికారంలోకి తీసుకురావాలని కోరారు.

## 'సూపర్‌స్పెషాలిటీ'లో నిలిచిన శస్త్రచికిత్సలు

వరంగల్‌చౌరస్తా, డిసెంబర్ 5: కాకతీయ సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్‌లో మంగళవారం శస్త్రచికిత్సలను నిలిపివేశారు. హాస్పిటల్ అవసరాలకు తగిన విధంగా నీటి సరఫరా లేకపోవడం వల్ల శస్త్రచికిత్సలు, వైద్యసేవలతోపాటు పారా మెడికల్ సేవలకు అంతరాయం ఏర్పడినట్లు సిబ్బంది తెలిపారు. హాస్పిటల్ అవసరాలకు నీటిని సమకూర్చుకోవడానికి వినియోగించే విద్యుత్ మోటర్లు మరమ్మతులకు గురికావడంతో నీటి సమస్య తలెత్తినట్లు వైద్యాధికారులు పేర్కొన్నారు. పర్యవేక్షణ కరువైందని, ఇప్పటికైనా వైద్యాధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టి శస్త్రచికిత్సలు, వైద్యసేవలను పునరుద్ధరించాని రోగులు, అటెండెంట్లు కోరుతున్నారు.

## కరాటే మాస్టర్లు దరఖాస్తు చేసుకోవాలి

కాశీబుగ్గ, డిసెంబర్ 5: జిల్లాలోని 76 ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత సెల్ఫ్ డిఫెన్స్ ప్రోగ్రాం చేపట్టేందుకు అర్హులైన కరాటే మాస్టర్ల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి సత్యవాణి ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆసక్తిగల వారు విద్య, కరాటేకు సంబంధించిన అర్హతలు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, సెల్‌ఫోన్ నంబర్‌తోపాటు కరస్పాండెంట్ అడ్రస్, శిక్షణలో ఇది వరకు ఉన్న అనుభవం ఉన్న సర్టిఫికెట్లను జతపరిచి ఈ నెల 14లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు కాశీబుగ్గలో ఓసిటీ స్టేడియంలోని జిల్లా యువజన, క్రీడల అధికారిని సంప్రదించాలని కోరారు.

## తుఫానుపై అప్రమత్తంగా ఉండాలి : ఎస్పీ

ములుగు రూరల్, డిసెంబర్ 5 : వాతావరణ శాఖ మిగ్‌చౌ తుఫాను హెచ్చరికలు జారీ చేసినందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ గౌష్ ఆలం అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. భారీ వర్షంతో పాటు ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు జాగ్రత్తలు పాటించాలన్నారు. కరెంట్ స్తంభాలు, చెట్లు విరిగి పడే ప్రమాదం ఉందని, ఇంటి నుంచి ఎవరూ బయటకు రావొద్దన్నారు. ఏటూరునాగారం సబ్ డివిజన్ పరిధిలో డీడీఆర్ఎఫ్ బృందాన్ని అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. జిల్లాలోని పోలీస్ స్టేషన్ అధికారులు సైతం తాడు, ట్యూబ్‌లు, విజిల్స్, టార్చ్ లైట్లు తదితర వస్తువులను సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. స్టేషన్ హౌస్ అధికారులు వారి పరిధిలో తుఫాను సంబంధిత సమస్యల సమాచారాన్ని పొందడంలో చురుగ్గా వ్యవహరించాలన్నారు. రోడ్లపై చెట్లు విరిగి పడితే వాటిని తొలగించే చర్యలు వేగంగా ఉండాలన్నారు. ముఖ్యంగా జంపన్నవాగు, గుండ్లవాగు, ప్రధాన చెరువులు, గోదావరి నది పరిసరాల్లో నివసిస్తున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. భారీ వర్షపాతం నమోదైతే వెంటనే దగ్గరలోని సురక్షిత ప్రాంతాలకు ప్రజలను తరలించాలని తెలిపారు. సమస్య తలెత్తిన వెంటనే ప్రజలు పోలీసులకు సమాచారం అందించి రక్షణ చర్యలను పొందాలని ఎస్పీ సూచించారు.

## ప్రజలను అప్రమత్తం చేయాలి : ఎమ్మెల్యే సీతక్క

తుఫాన్ ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ముంపు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని ఎమ్మెల్యే సీతక్క ఒక ప్రకటనలో అధికారులకు సూచించారు. ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అవసరం అయితే తప్ప ప్రజలు ఇంటి నుంచి బయటకు రావొద్దని, అధికారులు ఎలాంటి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులు అధైర్య పడొద్దని, కల్లాల్లో ఉన్న వరి ధాన్యంతో పాటు ఇతర పంటలను రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలిపారు.

## ఘనంగా ఇంటర్నేషనల్ వలంటీర్స్ డే

నర్సంపేటరూరల్, డిసెంబర్ 5: లక్నేపల్లి శివారు బాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ కళాశాలలో మంగళవారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ వలంటీర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. చైర్మన్ డాక్టర్ ఎ.రాజేంద్రప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ 1985 డిసెంబర్ 7న 40/212 తీర్మానంలో ఏటా డిసెంబర్ 5న స్వచ్ఛంద దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఐక్యరాజ్య సమితితో పాటు రెడ్‌క్రాస్, స్కౌట్స్, గైడ్స్ వంటి అనేక స్వచ్ఛంద సంస్థల సేవకు సహకారాన్ని అందిస్తున్నాయని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా శాంతి, అభివృద్ధికి మద్దతుగా వలంటరిజాన్ని మెరుగుపర్చడంతోపాటు కష్టాల్లో ఉన్న వారిని ఆదుకునేందుకు స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు.

## వైద్య విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి

**జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనాథ్**


మాట్లాడుతున్న డాక్టర్ శ్రీనాథ్

వరంగల్‌చౌరస్తా, డిసెంబర్ 5: వైద్య విద్యార్థుల సమస్యలపై కొత్త ప్రభుత్వం దృష్టి సారించాలని జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ కాకతీయ మెడికల్ కళాశాల విభాగం అధ్యక్షుడు డాక్టర్ శ్రీనాథ్ కోరారు. వరంగల్ ఎంజీఎం దవాఖానలో మంగళవారం ఏర్పాటు చేసిన అసోసియేషన్ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చాలాకాలంగా వైద్య విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. వైద్య విద్యార్థుల సమస్యలకు సరైన పరిష్కారాలు లభించడంతోపాటు ప్రభుత్వ వైద్య రంగంలో మెరుగైన సౌకర్యాలు సమకూరాలంటే శాసన సభ్యులుగా ఎన్నికైన డాక్టర్లలో ఒకరిని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రిగా నియమించాలని కోరారు. దీంతో మెడికోల సమస్యల పరిష్కారంతోపాటు ప్రభుత్వ దవాఖానల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయన్నారు. కార్యక్రమంలో జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు డాక్టర్ ప్రదీప్, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వాములకు అన్నదానం

కాశీబుగ్గ, డిసెంబర్ 5: అయ్యప్ప మాలధారులకు అన్నదానం చేయడం సంతోషంగా ఉందని కార్పొరేటర్ గుండేటి నరేంద్రకుమార్ అన్నారు. కాశీబుగ్గ ఓసిటీరోడ్డులోని సీతారామాంజనేయస్వామి ఆలయంలో నిత్యాన్నదానంలో భాగంగా మంగళవారం కార్పొరేటర్ హాజరై స్వాములకు భిక్ష వడ్డించారు. అలాగే, ప్రత్యేక పూజలు నిర్వహించగా అభివృద్ధి కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. అనంతరం నరేంద్రకుమార్ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానన్నారు. దాతల సహకారంతో జనవరి 5వ తేదీ వరకు నిత్యాన్నదానం నిర్వహించాలని సంకల్పించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తత్తరి లక్ష్మణ్, ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు యెలిశాల ఆనంద్‌కుమార్, దాసరి రాజేశ్, అన్నదాన కన్వీనర్ కుసుమ రాజేందర్, అర్చకులు శ్రీకాంతచారి, అల్లం నందకుమార్, శ్రీధర్ స్వామి, పాల్కొజు కరుణాకర్, తోపునూరి వీరన్న, చిట్టిమల్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.


కార్పొరేటర్ నరేంద్రకుమార్‌ను సన్మానిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

## నేషనల్ హ్యూమన్ రైట్స్ జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాస్



నర్సంపేట, డిసెంబర్ 5: నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జిల్లా అధ్యక్షుడిగా డ్యాగల శ్రీనివాస్ ఎంపికయ్యారు. జాతీయ అధ్యక్షుడు పి.సంపత్‌కుమార్ ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు అయిలినేని శ్రీనివాసరావు చేతులమీదుగా మంగళవారం నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జిల్లా అధ్యక్షుడిగా నియమించినందుకు సంతోషంగా ఉందన్నారు. తన నియామకానికి సహకరించిన జాతీయ అధ్యక్షుడు సంపత్‌కుమార్, రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావుకు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగాప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## జాతీయ స్థాయి బాలల సైన్స్ కాంగ్రెస్‌కు ఎంపిక

ఖిలావరంగల్, డిసెంబర్ 5: హైదరాబాద్ బేగంపేటలోని సెస్‌లో మంగళవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి బాలల సైన్స్ కాంగ్రెస్‌లో వరంగల్ జిల్లా శివనగర్‌కు చెందిన ఏకశిల స్కూల్ విద్యార్థిని బ్రాహ్మణి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు డీఈవో వాసంతి తెలిపారు. జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ కట్ల కృష్ణ నేతృత్వంలో గైడ్ టీచర్ మానస పర్యవేక్షణలో బ్రాహ్మణి 'పుట్టగొడుగల పెంపకానికి మొక్కల నుంచి పదార్థాల సంగ్రహణ' అంశంపై పరిశోధనాత్మకత ప్రాజెక్టు రూపొందించినట్లు వెల్లడించారు.

## నిరుపేద కుటుంబానికి ఫిక్స్‌డ్ డిపాజిడ్ పత్రాలు


పత్రాలు అందజేస్తున్న వెంకన్న

ఖిలావరంగల్, డిసెంబర్ 5: తూర్పుకోటకు చెందిన కార్మిక నాయకుడు సంగరబోయిన ఇంద్రసేన జ్ఞాపకార్థం ఆయన కుమారుడు ఉమేశ్ ఏటా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఇంద్రసేన జయంతిని పురస్కరించుకొని తూర్పుకోటలో తండ్రి లేని నిరుపేద బాలిక పేరుపై రూ. 10 వేలను పోస్టాఫీసులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశాడు. తన తండ్రి జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన ఇంద్రసేన మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏటా నిరుపేద ఆడబిడ్డలను గుర్తించి ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేస్తున్నట్లు ట్రస్ట్ చైర్మన్ ఉమేశ్ తెలిపారు.

# తుఫాన్‌తో రైతులు ఆగమాగం

- జిల్లావ్యాప్తంగా తడుస్తున్న ధాన్యం
- వరికోతలకు అంతరాయం
- అవస్థలు పడుతున్న అన్నదాతలు

ఖానాపురం/నర్సంపేటరూరల్/చెన్నారావుపేట, డిసెంబర్ 5: మిగ్‌జాం తుఫాన్ ప్రభావంతో మంగళవారం వరంగల్ జిల్లావ్యాప్తంగా వర్షం కురిసింది. ఖానాపురం మండలంలోని పాకాల ఆయకట్టులో వారం రోజులుగా వరికోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. వరికోతలు పూర్తి చేసుకున్న రైతులు ధాన్యంలో తేమశాతం తగ్గేందుకు ఆరబోసుకున్నారు. ఈ క్రమంలో తుఫాన్ వల్ల వర్షం కురుస్తుండడంతో ధాన్యం తడుస్తున్నది. అయితే, వడ్లను కాపాడుకునేందుకు రైతులు పరదాలు కప్పుకున్నారు. వర్షం వరికోతలకు తీవ్ర అంతరాయం కలిగించింది. కోతలు వారం రోజులు వెనక్కి వెళ్లినట్లేనని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే, తుఫాన్ ప్రభావం వల్ల నర్సంపేట మండలవ్యాప్తంగా వర్షం కురిసింది. గ్రామాల్లో ధాన్యం రాశులు తడవకుండా రైతులు టార్పాలిన్లు కప్పి ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు. వర్షానికి వడ్లగింజలు రాలిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అకాల వర్షాలతో చెన్నారావుపేట మండల కేంద్రంతోపాటు పాపయ్యపేట, లింగగిరి, అమీనాబాద్, కోనాపురం, ఉప్పరపల్లి, తండాల్లో ధాన్యం రాశులు తడవకుండా రైతులు టార్పాలిన్లు కప్పారు. మరో రెండు రోజులు వర్షాలు ఇలాగే కురిస్తే దాన్యం తడిసి మొలకెత్తే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### 99.2 మిల్లీ మీటర్ల వర్షపాతం

ఖిలావరంగల్: మిగ్‌జాం తుఫాన్ ప్రభావం వల్ల వరంగల్ జిల్లావ్యాప్తంగా మంగళవారం సాధారణ వర్షాపాతం నమోదైంది. సగటున 99.9 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు సీపీవో జీవరత్నం తెలిపారు. నల్లబెల్లిలో 11.9 మిల్లీ మీటర్లు, దుగ్గొండిలో 10.6, పర్వతగిరిలో 9.9, వర్ధన్నపేటలో 9, నెక్కొండలో 8.9, చెన్నారావుపేటలో 8.0, సంగెంలో 7.3, ఖానాపురంలో 6.8, నర్సంపేటలో 6.3, గీసుగొండ, రాయపర్తి, ఖిలావరంగల్ మండలాల్లో 5 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు వెల్లడించారు. రానున్న 48 గంటల్లో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. రైతులు అప్రమత్తంగా ఉండాలని సీపీవో సూచించారు.